అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ







ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

సంబరం.. అబ్బురం..





స్పోర్ట్స్ మీట్‌ను తిలకిస్తున్న ఆర్‌జే రత్నాకర్, అతిథులు

సాయి విద్యార్థుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్

సందర్శకులతో కిక్కిరిసిన హిల్ వ్యూ స్టేడియం

సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రారంభం

పుట్టపర్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యార్థులు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ అబ్బురపరిచింది. సత్యసాయి చిత్రపటాన్ని కారులో ఊరేగిస్తూ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్‌తో శనివారం ఉదయం స్టేడియంకు చేరుకున్నారు. వేదికపైన సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్రశాంతి నిలయం, అనంతపురం, బెంగళూరు బృందావనం, నందిగిరి విద్యార్థులు మంగళ వాయిద్యాలతో సత్యసాయి చిత్రపటానికి వందన సమర్పణ చేశారు. అనంతరం యూనివర్సిటీ జెండాను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించారు. సత్యసాయి స్పోర్ట్స్ మీట్‌తో బాబా శత జయంతి వేడుకలు ప్రారంభమైనట్లు ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. విద్యార్థులు మొదట 'దశావతారం.. కలియుగంలో సత్యసాయి అవతారం' పేరిట సంగీత, నృత్య ప్రదర్శన చేశారు. యుగావతార గరుడ వాహనం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల రోప్ విన్యాసాలు, కారుపై జంపింగ్, మండుతున్న గోళంలో బైక్ జంపింగ్‌లు అబ్బురపరిచాయి. ఈశ్వరమ్మ పాఠశాల హయ్యర్ సెకండరీ బృందావనం, నందిగిరి విద్యార్థినుల ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈశ్వరమ్మ పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. స్పోర్ట్స్ మీట్‌ను తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. స్పోర్ట్స్ మీట్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీసత్యసాయి గ్లోబల్ ట్రస్టు ఛైర్మన్ చక్రవర్తి, ట్రస్టు సభ్యులు నాగానందం, సత్యసాయి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్రప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

రైతును మింగిన అప్పులు

తాడిమర్రి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బోరు, పైపులైన్ వేయడానికి చేసిన అప్పులు ఓ రైతును మింగేశాయి. తనకున్న 5.30 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునేందుకు సీబీఆర్ ఏటీలో బోరు వేసి పైపులైన్ వేయడానికి అయిన ఖర్చులు ఆ రైతుకు భారమయ్యాయి. తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన వాల్మీకి పుల్లన్న కుమారుడు నాగేశ్(42) శనివారం తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు రూ.20 లక్షల దాకా అప్పులు చేసి తన పొలానికి రెండు కిలో మీటర్ల దూరంలోని సీబీఆర్ కాలువలో బోరు వేసి నీరుపడడంతో పైపులైన్ వేశాడు. మూడేళ్ల క్రితం అరటి పంటసాగు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి పంట సాగుకోసం అవుతున్న ఖర్చులు మాత్రమే దిగుబడిగా వచ్చిందేకానీ లాభాలు రాలేదు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగి రెండింతలు కావడంతో ఎలా తీర్చుకోవాలో దిక్కుతెలియని పరిస్థితిలో తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీప బంధువు శివయ్య గమనించి బంధువులకు సమాచారం అందించాడు. రైతును బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. నాగేశ్‌కు భార్య లక్ష్మీదేవి ఉన్నారు. వీరికి సంతానంలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రిష్ణవేణి తెలిపారు.

రోడ్డుప్రమాదంలో కార్మికుడి మృతి

ధర్మవరంరూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీతారంపల్లి 44వ జాతీయరహదారి క్రాస్ వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న కార్మికుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సీతారంపల్లి గ్రామానికి చెందిన మారుతి(42) మామిళ్లపల్లికి తన సొంత ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వస్తుండగా సీతారంపల్లి వైజంక్షన్ వద్ద తిరుగుతుండగా బెంగుళూరు నుంచి అనంతపురం వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుతి తీవ్రంగా గాయపడి సృహకోల్పోయాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు మామిళ్లపల్లి వద్ద అద్దాల ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసుకుని జీవనం సాగించేవాడన్నారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అప్పుడో.. ఇప్పుడో..!

కూలేందుకు సిద్ధంగా ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు

పిల్లర్లు దెబ్బతిని బయటకు కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు





● ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని కృష్ణంరెడ్డిపల్లి బీసీ కాలనీలోనిది. వాటర్ ట్యాంకు పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ట్యాంకు పిల్లర్ల పెచ్చులూడిపోయి కంకర, కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. పెద్ద గాలి వీస్తే ట్యాంకు ఊగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే స్థానికుల ప్రాణాలు పోయేపరిస్థితి ఉంది. మూడు దశాబ్దాల కిందట ఈ ట్యాంకు నిర్మాణం జరిగినట్లు సమాచారం.

అనంతపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్ హెడ్ నీటి ట్యాంకులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతాయో అన్నట్లుగా పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులు దెబ్బతిన్న విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు గ్రామాల్లో దెబ్బతిన్న ట్యాంకులు

రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, చియ్యేడు, తాటిచెర్ల, మన్నీల, కృష్ణంరెడ్డిపల్లి, పూలకుంట, కక్కలపల్లి కాలనీ, అక్కంపల్లి పరిధిలోని ఎన్‌ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ నీటి ట్యాంకులున్నాయి. వీటిలో తాటిచెర్ల, కృష్ణంరెడ్డిపల్లి, కక్కలపల్లి కాలనీ పరిధిలోని ట్యాంకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూలకుంట ఎస్సీ కాలనీలోని ట్యాంకు పరిస్థితి అప్పుడో.. ఇప్పుడో అన్నట్లుగా ఉంది. పూర్తిగా దెబ్బతినడంతో ట్యాంకుకు నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉప్పరపల్లిలోని ట్యాంకు మెట్లు దెబ్బతిడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఇనుప మెట్లు ఏర్పాటు చేయించారు. కాగా నరసనాయునికుంట గ్రామంలోని ట్యాంకు ఇటీవల కూలిపోయింది. ఈక్రమంలోనే దెబ్బతిన్న ట్యాంకులను తొలగించి, వాటి స్థానంలో నూతన ట్యాంకులను నిర్మించాలని కోరుతున్నారు.



పూలకుంట ఎస్సీకాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు

ట్యాంకు నిర్మాణాలకు ప్రతిపాదనలు..

మండలంలో దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. శిథిలమైన వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్తని నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా పంపాం. అనుమతులు రాగానే పాతవాటిని తొలగించి కొత్తవాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

- హరికుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్





● ఇక్కడ కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని తాటిచెర్లలోనిది. ఈ ట్యాంకును నాలుగు దశాబ్దాల కిందట నిర్మించినట్లు సమాచారం. ట్యాంకు పూర్తిగా దెబ్బతిని, శిథిలావస్థకు చేరకుంది. సిమెంట్ ఊడి పోవడంతో ఇనుప కండీలు కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

15 నుంచి గవిమఠం జాతర

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన కొప్పళ జిల్లా గవి మఠం జాతర ఈనెల 15న ప్రారంభం కానుంది. గవిసిద్దేశ్వర మఠం జాతరకు దశాబ్దాల చరిత్ర ఉంది. దీనిని దక్షిణభారత కుంభమేళాగా పిలుస్తారు. జాతరకు హాజరయ్యే లక్షలాది మందికి ఇక్కడ అన్నప్రసాదం అందించడం విశేషం. ఈ ఏడాది జాతరలో పోలియోతోపాటు ప్రమాదంలో కాళ్లు, చేతులు కోల్పోయినవారికి కృత్రిమ అవయవాల అమరిక శిబిరం ఏర్పాటు చేయనున్నారు. జాతరను 'అజ్జన జాతర'గా పిలుస్తారు.



సంక్రాంతికి.. ఇస్తున్నాం...!

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బగర్‌హుకుం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు తీపి కబురు అందింది. ఆ రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటవీప్రాంతాలకు సమీపాన, పల్లెల పరిధిలో ప్రభుత్వ భూములు చెరువు గట్లు, పోరంబోకు స్థలాలు, గోమాళ వంటి భూములను దశాబ్దాలకాలంగా సాగు చేసుకుని జీవనం సాగించే ప్రక్రియ రాష్ట్రంలోనే కాకుండా దేశమంతటా కొనసాగింది. రాష్ట్రాలవారీగా దశాబ్దాలపాటు సాగు చేసిన భూములకు హక్కులు కల్పించే ప్రక్రియ కొనసాగింది. ఇటువంటి సమస్య రాష్ట్రంలోనూ వెంటాడుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కొండలు, నదులతోపాటు సువిశాలమైన పశ్చిమ కనుమలు ఉన్నాయి. వీటితోపాటు ప్రధానమైన పదికిపైగా నదులు, వందల్లో చెరువులు ఉన్నాయి. వ్యవసాయ కూలీలుగా జీవించేవారు తమకు అనుకూలమైన భూమిని సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములను బగర్‌హుకుంగా పిలుస్తారు. నాలుగైదు దశాబ్దాలుగా బగర్‌హుకుం భూములకు శాశ్వత హక్కులు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. రెవెన్యూ పరిధిలో ఉన్న భూములకు సులభతరంగానే పట్టాలు మంజూరు చేసినా అటవీ, ఇతరత్రా భూములకు సమస్య కొనసాగుతోంది. రెవెన్యూ భూములకు కూడా పలు అడ్డంకులు తగిలాయి. దశాబ్దాలుగా రికార్డులు లేని పరిస్థితి ఉంది. అన్ని రాజకీయ పార్టీలు బగర్‌హుకుం సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినవారే. గత సిద్దరామయ్య పాలనలో కొంత కాలం రెవెన్యూ శాఖ మంత్రిగా వ్యవహరించిన కాగోడు తిమ్మప్ప బగర్‌హుకుం సమస్య పరిష్కారానికి తీవ్రమైన కసరత్తు చేశారు. ఆ తర్వాత ఆయన స్పీకర్‌గా వ్యవహరిస్తున్నా బగర్‌హుకుం సమస్యపై తరచూ మంత్రులను అప్రమత్తం చేసేవారు. కానీ నేటికీ రైతులు రికార్డుల కోసం తంటాలు పడుతూనే ఉన్నారు.

- బగర్‌హుకుం రైతులకు తీపి కబురు
- 15లోగా 15వేలమందికి పట్టాలు
- అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- అన్నదాతకు అనుకూలంగా
- పలు నిబంధనల సడలింపు
- అర్జీదారుడు మృతి చెందితే
- కుటుంబ సభ్యులకే భూమి
- పెండింగ్ దరఖాస్తులను
- పరిష్కరించాలని ఆదేశం


చిత్రదుర్గ జిల్లాలో బగర్‌హుకుం భూములు

పలు నిబంధనల సడలింపు

బగర్‌హుకుం భూములకోసం రికార్డులకోసం దరఖాస్తు చేసుకున్న ఎంతో మంది రైతులు మృతి చెందారు. వారి కుటుంబసభ్యులకు హక్కులపత్రాలు మంజూరు చేసేలా ప్రభుత్వం నిబంధనలు సడలించింది. సాధారణంగా దరఖాస్తు చేసుకున్న వారి పేరిటే హక్కుపత్రాలు ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. దరఖాస్తుదారుడు మృతి చెందినందున మరిన్ని వివాదాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. తహసీల్దారులు, ల్యాండ్ డెవలెప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌లకు ఈమేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దారుల పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తీర్మానించారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పరిష్కరించాలనే నిబంధన ఉంచారు. అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారనేది అర్థం కాని పరిస్థితిగా ఉంది. ఈనెల 15లోగా 15వేలమందికి హక్కుపత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కనీసం 5,600మంది లబ్ధిదారులకు సంక్రాంతిలోగా హక్కుపత్రాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే వరుస సెలవులతో ఇది సాధ్యమా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ లబ్ధిదారుడిగానే భావించాలని మంత్రులు సూచించారు. వారు భూములు పొందేందుకు అర్హులుగా భావించాలని దశాబ్దాలకాలంగా సాగు చేస్తున్న భూములకు రికార్డులు ఇవ్వడం ప్రభుత్వ కర్తవ్యమని మంత్రులు ఇటీవల జరిపిన కేబినెట్‌లో సూచించారు. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఇవ్వాలని, గత ఏడాది సెప్టెంబరు 2నుంచి తాలూకాలవారీగా ప్రత్యేక అభియాన కొనసాగిస్తున్నారు. దరఖాస్తులకు అనుగుణంగా భూముల పరిశీలన ఎంతకాలంగా సాగులో ఉన్నది, వాటికి సంబంధించి పన్నులు లేదా ఇతరత్రా చెల్లింపులు వంటివాటిని పరిశీలించి కొలతలు ముగించి రికార్డులు సిద్ధం చేయాలని రెవెన్యూశాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులు సూచించారు. అయితే ప్రాంతాలవారీగా కొన్ని సమస్యలు కొనసాగుతుండడంతో పూర్తి చేయలేకపోయారు. చిక్కోడి, అథణి, ఔరాద్, బీదర్, చిత్రదుర్గ, చామరాజనగర, చెళ్ళకెరె, హొళల్కెరెతోపాటు పలు తాలూకాలలో సర్వే ప్రక్రియ ముగిసినా రికార్డులు తయారు కాలేదు. సంక్రాంతి తర్వాత బగర్‌హుకుం భూముల సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఎవరి మద్దతూ అవసరం లేదు..!

- పార్టీ ఆదేశాలతోనే ముందుకెళ్తా
- అధిష్ఠానం అన్నీ గమనిస్తోంది..
- ఆలయాలను సందర్శిస్తే తప్పేముంది..?
- సీటీ రవి డ్రామా మాస్టర్
- డీసీఎం డీకే శివకుమార్


భారతీతీర్థ స్వామీజీ ఆశీర్వాదం పొందుతున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'నాకు ఎవరి మద్దతు అవసరం లేదు.. పార్టీ ఆదేశాలను పాటించుకుంటూ ముందుకెళ్తా, కర్మ సిద్ధాంతం ప్రకారం ఫలాలు దేవుడి ఇష్టం' అని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. శృంగేరిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాబోయే సీఎం అంటూ పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారన్న ప్రశ్నకు సమాధానంగా తనకు ఎవరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేల మద్దతు కూడా వద్దన్నారు. పార్టీ అగ్రనేతలు చెప్పినట్లు పనిచేసుకుంటూ పోతానన్నారు. తన కోసం ఎమ్మెల్యేలు, కార్యకర్తలు నినాదాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. టెంపుల్‌రన్ అంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారని వాటి గురించి ఆలోచించనన్నారు. నాకు మతం మీద నమ్మకం ఉందన్నారు. నిత్యం పూజలు చేస్తానన్నారు. నన్ను నమ్ముకున్నవారికి సమాజానికి మంచి జరగాలని ప్రార్థిస్తానన్నారు. ఎవరి నమ్మకం వారిదని, మతాలు వేరైనా సిద్ధాంతం ఒక్కటే ఉంటుందన్నారు. సీటీ రవి ఓ డ్రామా మాస్టర్ అన్నారు. అబద్ధాలను కలిపి ఓ కథ రూపొందించడంలో నేర్పరి అన్నారు. సీటీ రవికి బెదిరిస్తూ ఓ లేఖపై ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. అతడు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అని భావించారని ఇంతగా దిగజారుతారని ఊహించలేదన్నారు. బీజేపీ నేతలే తనతో మాట్లాడారని, అలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందన్నారు. ఇంకా సాగదీసేది లేదని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో లొంగిపోయే మావోయిస్టులు ఆయుధాలతో వచ్చేందుకు సాధ్యమా..? అంటూ ప్రశ్నించారు.

సువర్ణభారతిలో భాగస్వామ్యం

శృంగేరి శారదాపీఠం జగద్గురు భారతీతీర్థ స్వామీజీ సన్యాసం స్వీకరించి 50ఏళ్లు పూర్తైన సందర్భంగా సువర్ణభాతి మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీఎం డీకే శివకుమార్ స్వామీజీ ఆశీస్సులు పొందారు. విదుశేఖర భారతీతీర్థస్వామిజీతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలి

- లేదంటే హతమారుస్తాం
- బీజేపీ నేత సీటీ రవికి బెదిరింపు లేఖ

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బెళగావికి వచ్చి అభినేత్రికి కాళ్లు పట్టుకుని క్షమాపణలు చెప్పకుంటే హతమారుస్తామని ఇది హెచ్చరికగా భావించాలని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవికి ఓ లేఖ వచ్చింది. చిక్కమగళూరులోని నివాసానికి బెదరింపు లేఖ వచ్చినట్టు సీటీ రవి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 15రోజుల్లోగా బెళగావికి వచ్చి అభినేత్రికి కాళ్లు పట్టుకుని క్షమాపణలు కోరాలని లేనిపక్షంలో తగిన గుణపాఠం ఉంటుందని హెచ్చరించారన్నారు. చిక్కమగళూరులోని నా ఇంటికి వచ్చి కాళ్లు చేతులు విరిచి ప్రాణం తీస్తామని రాశారన్నారు. నీ కుమారుడిని చంపుతామని హుషార్ హుషార్ అంటూ లేఖలో రాశారన్నారు. ఈమేరకు చిక్కమగళూరు బసవనహళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. మంత్రిని వారు అభినేత్రిగా వర్ణించారన్నారు. ఇటువంటి లేఖలకు బెదిరేది లేదన్నారు.




బళ్లారి ఏపీఎంసీలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వేరుశనగ

రాసులున్నా..కాసులు రావు..!

- బళ్లారి ఏపీఎంసీకి భారీగా వేరుశనగ
- ధరలు లేక రైతుల డీలా

బళ్లారి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అమ్మబోతే.. అడవి కొంటే కొరివి అన్నట్లుగా మారింది వేరుశనగ రైతుల పరిస్థితి. వేరుశగన క్వింటాల్ ధర రూ. 2వేల నుంచి 2వేల 500 వరకూ పడిపోయింది. ప్రస్తుతం బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో వేరుశనగర క్వింటాల్ ధర రూ. 5వేల నుంచి 6 వేల వరకు పలుకుతోంది. అదీ నాణ్యత ఉన్న కాయ అయితేనే, ఇక నాణ్యత లేని కాయ అయితే క్వింటాల్ రూ. 3.500 నుంచి 4వేల వరకు మాత్రమే పలుకుతోంది. మరి కొందరు రైతులు తెచ్చిన వేరుశనగ కాయలు నాణ్యత లేవని వ్యాపారులు, దళారులు కొనుగోళ్లు చేయక వదిలేస్తున్నారు. గతేడాది ఇదే మార్కెట్‌లో మేలు రకం వేరుశనగర రూ. 8 వేల వరకు పలికింది. ఈ సారి ఏకంగా రూ.2వేల దిగువకు పడిపోయింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశగన పంట రైతులు అమ్మకానికి బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌కు తీసుకువచ్చారు. రెగ్యులర్ మార్కెట్ ఉండడంతో రైతులు ఎక్కువగా వేరుశనగ పంటను అమ్ముకునేందుకు వస్తున్నారు. రాష్ట్రంలో అధికంగా వేరుశనగ బళ్లారి మార్కెట్‌కే తరలిస్తుంటారు. ఇవే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని అనేక నియోజక వర్గాల నుంచి రైతులు ఇక్కడికి వేరుశనగ అమ్ముకునేందుకు వస్తున్నారు. విత్తన కాయ క్వింటాల్ రూ. 12 వేల వరకు రేటు పెట్టి కొన్నామని, ఇప్పుడు అమ్ముకుందామంటే ధరలు పడిపోయాయని వాపోతున్నారు. సరిగ్గా పంట సమయంలో వానలు కరవక పోవడం, కొన్నిచోట్ల అధిక వర్షాల కారణంగా పంట దెబ్బ తింది. కొన్ని చోట్ల పశువులకు మేతగా కూడా వదిలేశారు. ఇన్ని కష్టాలు పడి చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధర దక్కలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు కూడా రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో అంత రానీలే అని అమ్ముకునేందుకు ఏపీఎంసీకి వస్తే కొనుగోళ్లు చేసే నాథుడే లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఊరి నుంచి వేరుశనగ కాయలు ఏపీఎంసీ మార్కెట్‌కు తెచ్చేందుకు వచ్చిన లారీలు, ఆటోల అద్దె నెత్తిపై పడుతుందని, విధి లేని పరిస్థితుల్లో ఎంతో కొంతకు అమ్ముకుని పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాడవుతున్నా.. పట్టించుకోరు...!

లక్షల రూపాయలు వెచ్చించి తయారు చేసిన విగ్రహాలు ధ్వంసం అయిపోతున్నాయి. కన్నడ నాడు కళలకు, సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కళా రూపాలు వృథాగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకమైన భాష, ఆహారపు అలవాట్లు, వస్త్ర సంప్రదాయం, వివిధ రకాల వ్యవసాయ విధానాలు ఆచరించడం ఆనవాయితీ. కన్నడ సంస్కృతి ప్రతిబింబాలను ఒకే చోట చేర్చి అందరికీ చాటిచెప్పాలన్న ఆశయంతో తయారు చేసిన సాంస్కృతిక రూపాలు పాడవుతున్నా పట్టించుకోవడం లేదు..బళ్లారి కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

← చేయి విరిగిన విగ్రహం

8



ఉత్సాహంగా ఆర్మీ డే

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 77వ ఆర్మీడేలో భాగంగా నగరంలోని మాణెక్ షా పరేడ్‌మైదానంలో శనివారం 'నో యువర్ ఆర్మీ మేళా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ సాహస విన్యాసాలు అలరించాయి. మేజర్ జనరల్ విటి మాథ్యూ గాలిలోకి త్రివర్ణ బెలూన్లు ఎగురవేసి, వీర నారీమణులను సత్కరించడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయగీతాలాపన అనంతరం శ్వేత అశ్వ మోటార్ సైకిల్ బృందంచే పారా మోటర్ గ్లైడింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్‌సీసీ కేడెట్‌లు, పాఠశాల విద్యార్థులు, సామాన్య ప్రజలు, వృద్ధులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు పాల్గొని వీక్షించారు. ఆర్మీ శునకాలు, గుర్రాలతో విద్యార్థులు గడిపారు. ఆర్మీ వాహనాలు, ఆయుధాలను వీక్షించే అవకాశం కల్పించారు. ఖుక్రీ నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా సాగింది. వయనాడ్ వరదవిపత్తులు, ఇతర అత్యసర సమయాలలో ఆర్మీ జవాన్ల సేవలపై అవగాహన కల్పించారు. మొత్తమ్మీద ప్రజలకోసమే ఆర్మీ పనిచేస్తోందని తెలుసుకోవాలని సూచించేలా కార్యక్రమం సాగింది.


సాహస విన్యాసాలు ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు


ఆయుధాలు చేతబట్టిన విద్యార్థులు

నేటి ప్రముఖులు

పోర్‌ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంత్...

స్వామి వివేకానంద (జయంతి)



స్వామి వివేకానంద 1863 జనవరి 12న కోల్‌కతాలో జన్మించారు. అసలు పేరు నరేంద్రనాథ దత్త. హిందూ సాధువు. రామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యుడు. మన వేదాలలోని తత్వాలు, యోగాను పాశ్చాత్యదేశాలకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. రామకృష్ణ మఠం స్థాపించి ప్రపంచవ్యాప్తి చేశారు. చికాగోలో సర్వమత సమ్మేళనంలో ఆయన చేసిన ప్రసంగం దేశానికి వన్నె తెచ్చింది. ఆయన జయంతిని 'జాతీయ యువదినోత్సవం'గా ఆచరిస్తున్నాం. 1902 జూలై 4న పరమపదించారు.

జాక్ లండన్ (జయంతి)



జాక్ గ్రిఫిట్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. అమెరికాకు చెందిన నవలా రచయిత, పాత్రికేయుడు, సమాజసేవకుడు. అమెరికా రచయితలలో తొలిసారి అంతర్జాతీయ గుర్తింపు పొందిన వ్యక్తి ఆయనే. సైన్స్ ఫిక్షన్ కథనాలలో పేరొందారు. 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్', 'వైట్ ఫ్యాంగ్' వంటి రచనలు పేరొందాయి. ఆయన గౌరవార్థం యునైటెడ్ స్టేట్స్ పోస్టల్ సర్వీస్‌చే ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదలైంది. 1916 నవంబరు 22న కన్నుమూశారు.

యల్లాప్రగడ సుబ్బారావు (జయంతి)



దేశ వైద్య శాస్త్రజ్ఞులలో ఒకరైన యల్లాప్రగడ సుబ్బారావు 1895 జనవరి 12న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. లెడర్లీ ప్రయోగశాలలో వైద్య బృందం నాయకుడిగా ఫోలిక్ ఆమ్లం యొక్క ప్రత్యేకతను గుర్తించి స్ప్రూ వ్యాధి, మక్రోసైకిట్ అనీమియా అనే రక్తహీనత నిర్మూలనకు మందుగా నిర్ణయించారు. క్షయ రోగాన్ని నివారించే ఐసోనికోటి నికాసిడ్, హైడ్రాక్సైడ్ మందులను కనుగొన్నారు. బోధకాలు, టైఫాయిడ్, పాండురోగం వ్యాధులను నిర్మూలించే మందులను కనుగొన్నారు. 1948 ఆగస్టు 9న అమెరికాలో కన్నుమూశారు.

మహర్షి మహేశ్‌యోగి (జయంతి)



మహర్షి మహేశ్‌యోగి 1918 జనవరి 12న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. అసలు పేరు మహేశ్ ప్రసాద్ వర్మ. ఆధ్యాత్మిక గురువు స్వామి బ్రహ్మానంద సరస్వతికి శిష్యుడు. భావనాత్మక ధ్యానం చేయడాన్ని చాటారు. 40వేల మందికిపైగా బోధించారు. 2000లో 'గ్లోబల్ కంట్రీ ఆఫ్ వరల్డ్ పీస్' స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. వేదిక్ సైన్స్, ధ్యానంపై పలు పుస్తకాలు రచించారు. 2008 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

రామకృష్ణ హెగ్డే (వర్ధంతి)



రామకృష్ణ హెగ్డే 1926 ఆగస్టు 29న ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపుర తాలూకాలో జన్మించారు. జనతా పార్టీ నేత. కర్ణాటక ముఖ్య మంత్రిగా వ్యవహరించి చక్కటి పాలనాదక్షుడిగా పేరొందారు. రాష్ట్రంలో కాంగ్రెసేతర తొలి సీఎం ఆయనే కావడం విశేషం. 'రాష్ట్రీయ నవనిర్మాణ వేదికె' సంఘాన్ని, 'లోక్‌శక్తి' పేరిట సొంత రాజకీయ పార్టీని స్థాపించారు. పలు మార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. కాగా నాటకాలు, సినిమా లలోనూ నటించారు. పలువురు రాజకీయ నాయకులకు ఆయనే గురువు. 2004 జనవరి 12న కన్నుమూశారు.

ప్రియాంక గాంధీ (పుట్టినరోజు)



ప్రియాంకగాంధీ వాద్రా 1972 జనవరి 12న జన్మించారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల కుమార్తె. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సోదరి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. కాగా రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు ట్రస్టీగా ఉన్నారు. బుద్ధిస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా వ్యవహరిస్తారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో క్రియా శీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆమె కేరళ రాష్ట్రం వయనాడ్ నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు.

జెఫ్ బెజోస్ (పుట్టినరోజు)



జెఫ్రీ ప్రెస్టోన్ బెజోస్ 1964 జనవరి 12న జన్మించారు. ప్రముఖ ఆన్‌లైన్ సంస్థ అమెజాన్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్. 2024 డిసెంబరు నాటికి ప్రపంచ శ్రీమంతులలో రెండో వ్యక్తిగా నిలిచారు. ప్రముఖ ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చర్ సంస్థ బ్లూ ఆరిజిన్ సంస్థ సంస్థాపకులు. పారిశ్రామికవేత్తగా, మీడియా ప్రొప్రైటర్‌గా, ఇన్వెస్టర్‌గా పేరొందారు. ఫ్రెంచ్ దేశానికి చెందిన 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' తదితర గౌరవాలు అందుకున్నారు.

హారిక ద్రోణవల్లి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత హారిక ద్రోణవల్లి 1991 జనవరి 12న గుంటూరులో జన్మించారు. చదరంగంలో 'గ్రాండ్ మాస్టర్'గా పేరొందారు. 2012, 2015, 2017లలో 'ఉమెన్స్ వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్' లో మూడుసార్లు కాంస్యపతకం సాధించారు. 2007-08 సంవత్సరానికి అర్జున అవార్డు పొందారు. ఫైడ్ ఉమెన్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో విజేతగా నిలిచారు. హంపి కోనేరు తర్వాత రెండో గ్రాండ్‌మాస్టర్ ఆమెనే. 2017లో టాప్ 40 ఉమెన్ స్పోర్ట్స్‌పర్సన్స్‌లో ఒకరిగా నిలిచారు. 2021లో ఫైడ్ ఉమెన్స్ వరల్డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యపతకం సహా పలు గౌరవాలు పొందారు.

మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ద్వితీయ మహాసభలను విజయవంతం చేయా లని ఆ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి నాగయ్య శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణమండపంలో నిర్వహి స్తున్నట్లు తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోండి

» డ్రైవర్లకు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి సూచన

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏటా రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని డ్రైవర్లు ప్రమాదరహితం దిశగా పాటుపడాలని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇండియన్ వెహికల్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్, స్నేహజీవి డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రమాదరహిత డ్రైవర్లకు సారథి నెంబరు వన్ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ట్రేడ్ యూనియన్ వ్యవస్థాపకులు గండసి సదానందస్వామి అధ్యక్షత వహించగా స్నేహజీవి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజు కన్నడిగ పాల్గొన్నారు. మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రమా దాలు తగ్గించేదిశగా డ్రైవర్లు వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం సరికాదని, ఎంతోమంది అమాయకులు రోడ్డున పడతారన్నారు. వివిధ రంగాల సాధకులకు కళాసేవా రత్న పురస్కారాలను ప్రదానం చేశారు.



డ్రైవర్లకు సన్మానంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

నిర్మాతల సంఘం అధ్యక్షుడు ఉమేశ్ బణకార్, నిర్మాత ఓంసాయి ప్రకాశ్, గోసంరక్షకులు మహేంద్రమున్నోత్, సీనియర్ నటుడు వైజనాథ్ బసప్ప బిరాదార్, మూగు సురేశ్, చంద్రప్రభతోపాటు పలువురు పాల్గొన్నారు.

డిజిటలీకరణకు శ్రీకారం

బంగారపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలలో అన్ని రికార్డులను డిజిటలీకరణ చేసే ప్రక్రియకు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి శ్రీకారం చుట్టారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇ-డిజిటలీకరణతో రికార్డులను దిద్దుబాటు చేసే వీలు కాదన్నారు. తద్వారా మోసాలకు చెక్ పెట్టడమే లక్ష్యమన్నారు. పాత రికార్డులను కంప్యూటరీకరణ చేయడం ద్వారా భూ రికార్డులను శాశ్వతంగా డిజిటల్ చేయనున్నట్టు తెలిపారు. తద్వారా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రజలు అనవసరంగా తిరిగే శ్రమ తప్పుతుందన్నారు. తహసీల్దారు సుజాత మాట్లాడుతూ అన్ని రికార్డులను రక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సోమవారం నుంచి డిజిటలీకరణ ప్రక్రియ కొనసాగుతుందని రైతులకు ఎంతో అనుకూలం కాగలదన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, కేడీపీ అధ్యక్షుడు గోపాలరెడ్డి, గ్రేడ్-2 తహసీల్దారు గాయత్రి, ఉప తహసీల్దారు ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటలీకరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణ స్వామి

14న సిద్దరామేశ్వర జయంతి



మీడియా సమావేశంలో వినయ్‌కుమార్ తదితరులు

బాగేపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డరపాళ్య ఒకటో వార్డులో రూ.1.5 కోట్లలో నిర్మించిన బోవి నూతన భవనం, సిద్దరామేశ్వర 847వ జయంతి ఈనెల 14న జరగనుందని బాగేపల్లి తాలూకా బోవి సంఘం అధ్యక్షుడు వినయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బోవి సామాజిక వర్గీయుల కల ఎమ్మెల్యే సుబ్బారెడ్డి చొరవతో సాకారం కానుందన్నారు. బోవి గురువు ఇమ్మడి సిద్దరామేశ్వర స్వామిజీ ప్రారంభించనున్నారన్నారు. ఇదే సందర్భంగా సామాజికవర్గానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీ, డిగ్రీ విద్యార్థులకు ప్రోత్సాహ కాలు, సాధకులకు సన్మానం ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో ఎంవి కృష్ణప్ప, కెవి శ్రీనివాస్, వెంకటరామ్, లంబూ శ్రీనివాస్, అశ్వథప్ప, ఎన్ నారాయణప్ప, రమేశ్‌బాబు, వెంకటేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు సిద్దయ్య పురాణిక్

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కావ్యానంద పేరిట ప్రసిద్ధి చెందిన డాక్టర్ సిద్దయ్య పురాణిక్ ఐఏఎస్ అధికారిగా పాలనలోనే కాకుండా స్వాతంత్ర్యానంతరం కర్ణాటక ఏకీకరణలో ఉత్తమమైన పనులు చేశారని కన్నడ అభివృద్ధి ప్రాధికార చైర్మన్ డాక్టర్ పురుషోత్తమ బిళిమలె అభిప్రాయపడ్డారు. నయన సభాంగణంలో కన్నడ సాహిత్య సంవర్ధక ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ లలిత హొసప్యాటికి కావ్యానంద పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్యులుగా పాల్గొన్న పురుషోత్తమ మాట్లాడుతూ కావ్యాలు, నాటికలు, బాలసాహిత్యం ద్వారా ఎంతోమందికి రచనలపట్ల స్ఫూర్తి కలిగించినవారు సిద్దయ్య పురాణిక్ అన్నారు. స్వాతం త్ర్యానంతరం భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటైనప్పుడు పురాణిక్ కర్ణాటక ఏకీకరణ కోసం కన్నడ దీపం వెలగాలనే రచన రాష్ట్రమంతటా మార్మోగిందన్నారు. రచయిత్రి లలిత హొసప్యాటి, బ్యూటి బెళ్కక్కితోపాటు బాలసాహిత్యంలో ఎంతో సాధనలు చేశారన్నారు. ట్రస్టు అధ్యక్షురాలు విజయ నందీశ్వర, కార్యదర్శి డాక్టర్ రుద్రేశ్ అదరంగి, ట్రస్టు సభ్యులు డాక్టర్ బసవరాజ్ కల్లుడి, భారతి మృత్యుంజయతోపాటు కవి సంగమేశ్‌గణి, ప్రసన్నకుమార్ పురాణిక్ తదితరులు పాల్గొన్నారు.



రచయిత్రి లలిత హొసప్యాటికి కావ్యానంద పురస్కారం

పాల దిగుబడిలో మహిళలపాత్ర అపారం



మహిళా రైతులకు సన్మానంలో మంత్రి వెంకటేశ్ తదితరులు

బొమ్మనహళ్ళి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాల దిగుబడిలో మహిళల పాత్ర అపారమని పశుసంవర్ధకశాఖ మంత్రి వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (ఐడీఏ) సౌత్‌జోన్ సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడుల నుంచి మహిళా సాధకులను సత్కరించారు. ఉత్తమ మహిళా రైతులు 2024 పురస్కారంతో ఏపీ నుంచి నవీన్‌కుమారి, తెలంగాణ నుంచి గంగావాణి, కర్ణాటక నుంచి మంగళమ్మ, పుదుచ్చేరి నుంచి సెల్వానాయకి, కేరళ, లక్షద్వీప్‌ల నుంచి విధురాజీవ్‌లను సత్కరించారు. ఐడీఏ సౌత్‌జోన్ డైరెక్టర్ డాక్టర్ సతీశ్ కులకర్ణి మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో నాణ్యమైన పాలను తక్కువధరకు అందిస్తున్నామన్నారు. నందిని బ్రాండ్‌కు ఎంతో ఆదరణ ఉందన్నారు. సమావేశంలో డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు సోది, ఇండియా నేషనల్ రీసెర్చ్‌ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జీత్‌సింగ్, కెఎంఎఫ్ డైరెక్టర్ శివస్వామి, దొడ్ల డెయిరీ ఎండీ సునిల్‌రెడ్డి, సౌత్‌జోన్ కులకర్ణి, సౌత్‌జోన్ సెక్రటరీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు తొలిరోజు సదస్సులో పారిశ్రామికవేత్తలు, రెండోరోజు సదస్సులో సైన్స్ అండ్ టెక్నాలజీ, ముగింపున మహిళా రైతులను సత్కరించారు. సదస్సులో భాగంగా వివిధ స్టాళ్లు ఏర్పాటు చేశారు.

రసాయనాల లీకేజీ.. కార్మికుల అస్వస్థత

» బిర్లా గ్రూప్ ఫ్యాక్టరీలో ప్రమాదం

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా కార్వార తాలూకా బిణగలోని ఆదిత్యబిర్లా గ్రూప్‌నకు చెందిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కాస్టిక్ సోడా ఉత్పాదనా ఫ్యాక్టరీలో శనివారం రసాయనాల లీకేజ్ అయ్యింది. 18మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీలో కార్మికులు పనిచేస్తున్న సమయంలోనే రసాయనాలు లీక్ అయ్యాయి. కళ్లలో మంటలు, శ్వాసకోశ సమస్యలు తలెత్తాయి. వెంటనే కంపెనీ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన వారందరినీ ఆసుపత్రికి తరలించారు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో కాస్టిక్‌సోడా, ఫాస్ఫరిక్ యాసిడ్, క్లోరిన్ వంటి రసాయనాలను తయారు చేస్తారు. వందలాదికార్మికులు పనిచేస్తున్న సమయంలోనే సాంకేతిక లోపం ఏర్పడి యాసిడ్స్ లీక్ అయ్యాయి. ఇలా 14 మంది కిమ్స్ ఆసుపత్రికి, మరో నలుగురిని ఇతర ఆసుపత్రులకు తరలించారు. పెను ప్రమాదం లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కేప్టెన్ రమేశ్‌రావ్ తెలిపారు. కళ్లల్లో మంటలతోపాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అయితే తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదన్నారు.

చెరువు అభివృద్ధికి నూతన కమిటీ

శిడ్లఘట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గంజిగుంటె వలయ పరిధిలోని జి కురుబరహళ్ళి కదిరప్పన చెరువు అభివృద్ధికి తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సభ్యులు బైరారెడ్డి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. సురేశ్‌గౌడ మాట్లాడుతూ గ్రామ కల్యాణ కార్యక్రమాలు, పాల ఉత్పత్తిదారుల సంఘం నిర్మాణం, జ్ఞానదీప, హిందూ స్మశాన వాటిక అభివృద్ధి, నవచేతన కార్యక్రమం, నవచతేన, జనమంగల కార్యక్రమాలు తదితర అంశాలను ప్రస్తావించారు. కురుబరహళ్ళి కదిరప్ప చెరువును అభివృద్ధి చేసేందుకు ఒక కమిటీ, కార్యవర్గ మండలి రూపొందించి బాధ్యత అప్పగించాలని భావిస్తున్నట్టు తెలిపారు. చెరువు కమిటీ అధ్యక్షుడిగా కెసి నారాయణస్వామిని సమితి సభ్యులందరి అంగీకారంతో ఎంపిక చేశారు. కెఎన్ లోకేశ్, కెసి వెంకటేశ్, వెంకటరెడ్డి, మునేశ్, అంబరీశ్, కెఎన్ మునిరెడ్డి, హేమంత్, అజిత్, రిజ్వాన్, మంజునాథ, ఆంజిలను కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. బైరారెడ్డి మాట్లాడుతూ యాక్షన్‌ప్లాన్ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమైక్యంగా ఉంటే గ్రామ చెరువు అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో రంగనాథ్, మల్లికార్జున్, నారాయణస్వామి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న యోజనాధికారి సురేశ్‌గౌడ తదితరులు

ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదానికి ఆదరణ పెరుగుతోందని ఇటీవల కాలంలో హ్యూమన్ క్లినికల్ ట్రయల్‌లో అమృత్ నోని తన ఉత్పత్తుల ద్వారా ప్రయోగించిందని ఎండీ డాక్టర్ శ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో 15 శాతంమంది ప్రజలు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారని, డయాబెటిక్, కేన్సర్ కంటే ఎక్కువమంది ఇబ్బంది పడుతున్నారన్నారు. దశాబ్దన్నరకాలంగా నొప్పి నివారణలో అమృత్‌నోని ఉత్తమ ఫలితాలు ఇస్తోందన్నారు. మంగ ళాంబిక మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులు, నిపుణుల పరిశోధనల మేరకే మనుష్యులపై క్లినికల్ ట్రయల్ చేశామన్నారు. నలంద క్లిన్సర్ బెంగళూరు సంస్థ పరిశోధనా డాక్టర్ బిజి వార్ని తోపాటు పలువురు పాల్గొన్నారు.

రాయదుర్గంలో భారీగా సోలార్ ప్లాంట్లు

అనంతపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 7500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్టీపీసీ దక్షిణభారత కోఆర్డినేటర్ శంకర్ రాజు, ఏపీ ట్రాన్స్‌కో మాజీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబులతో శనివారం సమావేశమయ్యారు. ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్షించారు. కాలవ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవకాశం లభిస్తుందన్నారు. రాయదుర్గం పరిధిలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1500 మెగావాట్ల ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఆ మేరకు స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో శ్రమిస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నా రన్నారు. చంద్రబాబుపై విశ్వాసం, ప్రభుత్వ ప్రోత్సాహంతో వివిధ సంస్థలు, నిర్వాహకులు పరిశ్రమల స్థాపనకు రాష్ట్రానికి వస్తుండటం శుభపరిణామమన్నారు.

మానవతా విలువలు పెంచుకోవాలి

దొమ్మసంద్ర, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి పౌరులని విద్యార్థిదశనుంచే మానవతా విలువలను పెంచుకోవాలని అవినీతి వ్యవస్థపై పోరాడే మనస్తత్వం అలవరుచుకోవాలని మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సర్జాపుర పట్టణం దొడ్డతిమ్మసంద్రలోని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనిషిగా జన్మించినందుకు సార్థకత చేసుకోవాలన్నారు. ప్రతిదశలోనూ తృప్తి ఉండాలని, దురాశ దు:ఖానికి చేటు అన్నారు. తమ చిన్నతనంలో అవినీతి, హత్య, దోపిడీ తదితర కేసులలో జైలుకు వెళ్లి వచ్చినవారిని సమాజం బహిష్కరించేదన్నారు. అయితే ప్రస్తుతం అవినీతిపరులు, జైలుకు వచ్చినవారిని సమాజం గౌరవించడం విషాదమన్నారు. సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యాసంస్థ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ స్థానిక పేద కూలికార్మికుల పిల్లలకోసం విద్యాసంస్థ ఏర్పాటు చేశామని, ఎస్ఎస్ఎస్ఎల్ ఫలితాల్లో ఉత్తమ సాధన రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షులు ఆర్ లక్ష్మీదేవి, ట్రస్టీ చందుయాదవ్, కేపీసీసీ కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డేకు సన్మానం

అప్పయ్యణ్ణ సేవలు స్మరణీయం

» సంస్మరణ సభలో కేంద్రమంత్రి కుమారస్వామి

దొడ్డబళ్ళాపుర, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తాలూకా, జిల్లాస్థాయిలో జేడీఎస్ బలోపేతానికి కృషి చేసిన జడ్పీ మాజీ సభ్యుడు, బముల్ మాజీ అధ్యక్షుడు అప్పయ్యణ్ణ మృతి పార్టీకి తీరని నష్టమని, సహకార, పంచాయతీ రాజకీయాలలో ఆయన ప్రామాణిక సేవలు స్మరణీయమని కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని హాడోనహళ్ళి రంగమందిరంలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను ఢిల్లీలో ఉన్న వేళ అప్పయ్యణ్ణ మృతి చెందినట్టు సమాచారం వచ్చిందని, నమ్మడానికి సాధ్యం కాలేదని ఆరోగ్యంగా ఉండేవారని మరోసారి కనుక్కోవాలని సూచించానని అయితే ఆయన కనుమరుగయ్యారనే విషయం బాధ కలిగించిందన్నారు. ఆయన సాధనల గురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించి మాట్లాడుతూ చిన్నరైతు కుటుంబంలో జన్మించిన అప్పయ్యణ్ణ తాలూకా నాయకుడిగా ఎదిగి దొడ్డబళ్ళాపుర, కనకపుర తాలూకా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండేవారన్నారు. సహకారరంగంలో మహిళా రైతులకు ఆర్థికత కల్పించేలా పాటుపడ్డారన్నారు. ఢిల్లీలో ముందస్తు కార్యక్రమాల్లో పాల్గొనడంతో అప్పయ్యణ్ణ అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయానని అందుకు అభిమానులు మన్నించాలన్నారు. కాగా పదేళ్లకోసారి కులగణన జరగాల్సి ఉన్నా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపలేదన్నారు. 12ఏళ్లక్రితం జనాభా లెక్కింపు జరిగిందని ఇప్పటికీ అదే పరిగణించాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్సీ సీటీ రవికి బెదరింపు లేఖను తీవ్రంగా పరిగణించాలన్నారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథ స్వామిజీ, ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్, బెంగళూరు గ్రామీణ జిల్లా జేఈఎస్ అధ్యక్షుడు బి మునేగౌడ, మాజీ ఎమ్మెల్యేల నిసర్గ నారాయణస్వామి, పిళ్ళమునిశ్యామప్ప, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు లక్ష్మీపతయ్య, మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.




అప్పయ్యణ్ణ సాధనల పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి కుమారస్వామి తదితరులు

నెట్టికంటి సేవలో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టరు

గుంతకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టరు వెంకటరమణ మూర్తి కుటుంబ సమేతంగా శనివారం ఉదయం కసాపురం దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వెంకట రమణ మూర్తి, ఆయన కుటుంబ సభ్యులను దేవస్థాన అధికారులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. స్వామివారి ఉత్తరీయాన్ని వేసి ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



పూజల్లో వెంకటరమణ మూర్తి దంపతులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.93	1,588.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9.690	0
నీటి నిల్వ (టీఎంసీలు)	73.04	10.20

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

సిరుగుప్ప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం శనివారం సందర్భంగా పట్టణంలోని పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేపట్టారు. భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు.

హోటల్లోకి దూసుకెళ్లిన లారీ



బొల్తా పడిన లారీ

రాయచూరు జనవరి 11(ఆంధ్రజ్యోతి): వరిపొట్టు లోడ్‌తో వెళుతున్న లారీ అదుపుతప్పి హోటల్లోకి దూసుకెళ్లిన సంఘటన నగర సమీపంలోని యరమరస్ బైపాస్ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రాయచూరు నుంచి హైదరాబాద్‌కు పొట్టు లోడ్‌తో వెళ్తున్న లారీ ఓవర్ లోడ్ కారణంగా క్రాస్ వద్ద అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి వేళ హోటల్ మూసి ఉండడంతో ప్రాణాపాయం తప్పి పోయినా పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. రేకుల షెడ్డు మొత్తం కుప్పకూలిపోగా హోటల్‌లో ఉన్న బెంచీలు ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమై పనికిరాకుండా పోయాయని బాధితులు తెలిపారు. దాదాపు 4-5 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు స్థానికులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

షెడ్ల తొలగింపునకు ఆదేశాలు

రాయచూరు జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లాధికారి నివాసం గృహం నుంచి సాత్‌మైల్ క్రాస్ వరకు రోడ్డుకు ఇరువైపున ఉన్న షెడ్లు, ఇతర మున్సిపల్ స్థలంలో వెలసిన దుకాణాలను స్వంతంగా తొలగించుకోవాలని రాయచూరు మహానగర పాలికె కమిషనర్ గురుసిద్దయ్య హిరేమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ హైవే-30, నేషనల్ హైవే-150-ఏ లో భాగంగా ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపుల కొంత మంది దుకాణ దారులు మున్సిపల్ స్థలాలను ఆక్రమించుకుని షెడ్లు, దుకాణాలు వేసుకున్నారని వారంతా వారం రోజుల్లోగా తమ స్వంత ఖర్చులతో వాటిని తొలగించుకోవాలన్నారు. మహానగర పాలిక ఆధ్వర్యంలో వాటిలో తొలగించే పక్షంలో జరిగిన నష్టానికి ప్రభుత్వం, రాయచూరు మహానగర పాలిక బాధ్యత వహించదన్నారు. అదే విధంగా ఎలాంటి పరిహారం కూడా అందజేయడం జరగదని స్పష్టం చేశారు.

ముగిసిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఆంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ముగిశాయి. ముందుగా స్వామివారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు రాజేశ్ పూజలు చేశారు. అనంతరం శాంతిహోమం, పూర్ణాహుతి, బలిహారణ, కలశ ఉద్వాసన తదితర పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాడవుతున్నా..పట్టించుకోరు..!



వృథాగా ఉన్న విగ్రహాలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విభిన్నమైన కళలు, సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన కన్నడ నాడు కళలకు, కళాకారులకు ప్రసిద్ధ. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకమైన భాష, ఆహారపు అలవాట్లు, వస్త్ర సాంప్రదాయం, వివిధ రకాల వ్యవసాయం విధాలతో సంస్కృతి మిళతమ య్యింది. కన్నడ సంస్కృతి ప్రతిబింబాలను ఒకే చోట చేర్చి అందరికీ చాటిచెప్పాలన్న ఆశయంతో తయారు చేసిన కళాసాంస్కృతిక బొమ్మలు కళావిహీనమయ్యాయి. నగరంలోని జిల్లా అధికారి నివాసానికి సమీపంలోని కన్నడ సాంస్కృతిక శాఖ శాఖ కార్యాలయం ఎదురుగా రెండు దశాబ్దాల క్రితం అప్పటి నాయకులు రూపొందించిన కళాకృతులను కాపాడుకోవడంలో జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కళాఖండాలు ఎండకు ఎండి, వానకు తడిచి కళావిహీనమైనా... సాంస్కృతిక శాఖ అధికారులు మాత్రం వాటిపై కన్నెత్తి చూడడం లేదు. ఏటా కళాసాంస్కృతి కార్యక్రమాల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్న అధికారులు కన్నడ సంస్కృతి అద్దం పడుతున్న బొమ్మలకు తిరిగి ప్రాణం పోయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని కళాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంగణంలో కేంద్ర గ్రంథాలయం, పురావస్తు శాఖకు చెందిన కార్యాలయం ఉన్నందున నిత్యం జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, పరిశోధకులు వచ్చి వెళుతుంటారు. అయితే వీటిపై దృష్టిసారించక పోవడం గమనార్హం. శిథిలావస్థకు చేరుకున్న ఈ కళాకృతులకు మరమ్మతులు చేసి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడంపై జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ నాయకులు చొరవ చూపాలని కన్నడ అభిమానులు కోరుతున్నారు.



రంగులు వెలసిన విగ్రహాలు..

భూ రికార్డుల ఈ-ట్రెజరీని ప్రారంభించిన ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతివ):రాష్ట్ర దేవదాయా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భూభద్రత కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన భూ రికార్డుల ఈ-ట్రెజరీని శనివారం ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ప్రారంభించారు. నగరంలోని నూతన జిల్లా పాలనా భవనంలో ఏర్పాటు చేసిన ఈ ట్రెజరీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తాలూకా కార్యాలయం, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల భూరికార్డులంటినీ డిజిటలైజ్ చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అధ్వాన స్థితిలో ఉన్న పాత భూ రికార్డులను శాశ్వత డీజీ రికార్డులుగా మార్చడం , రికార్డు గదుల నుంచి రికార్డులను పొందడంలో ఉన్న ఇబ్బందులను తొలగించడం, పాత రికార్డులను భద్రపరచడం, దొంగతనం-సవరణ నియంత్రణతో సహా అనేక ప్రయోజనాలను ప్రజలు పొందవచ్చన్నారు. భవిష్యత్తులో ఎలాంటి రికార్డులయినా ప్రజలు సులభంగా పొందవచ్చన్నారు.

సిరుగుప్ప : డిజిటల్ యాంత్రీకరణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో భూములకు సంబంధించి పట్టా పాసుపుస్తకాలు ధృవీకరణ పత్రాల కోసం డిజిటల్ యాంత్రీకరణాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ యాంత్రీకరణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథ్, డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఈ-ట్రెజరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

దొంగ అరెస్ట్.. చోరీ సొత్తు స్వాధీనం



రికవరీ చేసిన సొత్తును చూపుతున్న డీఎస్పీ వెంకటేష్

బళ్లారిరూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బళ్లారి రూరల్ పరిధిలోని కొద్దిరోజులుగా పలు చోరీలకు పాల్పడిన ఇస్మాయిల్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు బళ్లారి నగరం తాళ్లూరు రోడ్డు రేణుకనగర్ 12వ క్రాస్‌కు చెందిన ఇస్మాయిల్ ఇటీవల పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ. 1.78 లక్షల వెండి, బంగారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వన్నప్ప పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ మంజునాథ, రమేష్ బాబు, బక్రీద్, శ్రీనివాసరెడ్డి, ఎస్‌హెచ్ రమేష్‌బాబు, ఖాజామొయిద్దీన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై వినియోగదారులు

అవగాహన పెంచుకోవాలి

ఫోరం అధ్యక్షుడు కేవీ సురేంద్ర కుమార్

రాయచూరు జనవరి 11(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు చట్టబద్ధంగా తమకు ఉన్న హక్కుల పై సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కేవీ సురేంద్ర కుమార్ సూచించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువు పై రశీదు తప్పని సరిగా పొందాలని దీంతో పాటు వస్తు సేవల విషయంలోను చట్ట పరంగా నేక నిబంధనలు ఉన్నాయని వారికి వివరించారు. చట్టబద్ధంగా ప్రభుత్వాలు వినియోగదారుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన నిబంధనలను హక్కులను ప్రతిఒక్కరూ తెలుసుకుని అందుకనుగుణంగా తమ వ్యాపార వ్యవహారాలను లావాదేవీలను కొనసాగించుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి వివక్ష లేదా మోసానికి గురైనా వెంటనే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి తగిన న్యాయం పొందవచ్చన్నారు. ఏదానా ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో కూడా చేయవచ్చన్నారు.

పోలీసుల పని తీరు భేష్ : ఎస్పీ

రాయచూరు జనవరి 11(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన వస్తువులను రికవరీ చేసి వాటిని యజమానులకు అప్పగించడం ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సిబ్బందిని ప్రశంసించారు. నగరంలోని సదర్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీకి గురైన విలువైన సెల్‌ఫోన్‌లను శనివారం యజమానులకు అప్పగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ పోలీసులు దొంగతనం కేసులను చేధించడంలో చూపుతున్న చొరవ పోలీసులను అభినందించారు. ఈ పరిశోధనలో పని చేసిన పోలీసులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే రీతిలో మిగతా కేసుల్లోను చొరవ తీసుకుని ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. కాగా దొంగతనాలు జరగకుండా పోలీసులు చేస్తున్న కృషికి ప్రజల సహకారం కూడా అవసరమని అన్ని విధాల ప్రజలు సహకరించాలని సూచించారు.



చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను యజమానులకు అప్పగిస్తున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

గణతంత్ర వేడుకలను సజావుగా నిర్వహించాలి

● ముందస్తు సమావేశంలో అధికారులకు కలెక్టర్ సూచన

బళ్లారి సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జిల్లాకేంద్రంలో 76వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులకు సూచించారు. నగరంలోని అనంతపురం రోడ్డులోని నూతన జిల్లా పాలనా భవనం హాల్లో శనివారం గణతంత్ర దినోత్సవ కార్యక్రమ సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జనవరి 26న ఉదయం 9గంటలకు నగరంలోని మిమ్స్ మైదానంలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ముద్రించి ప్రజాప్రతినిధులకు, ప్రముఖులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి రిసెప్షన్, మర్యాదులు, ఆహ్వాన పత్రికలతో పాటు వేదిక కమిటీ, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీతో పాటు పలు కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీల్లోని అధికారులు తమకు అప్పగించిన పనులను చక్కగా నిర్వహించాలన్నారు. వేడుకలు నిర్వహించే విమ్స్ మైదాన ఆవరణను శుభ్రం చేసి తాగునీటి వసతి కల్పించాలని, ప్రముఖులు కూర్చునేందుకు సీట్లు ఏర్పాటు చేయాలని మహానగర పాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులను సత్కరిస్తున్నధర్మకర్తలు వెంకోబరావు,సురేంద్ర, శ్రీనివాసరావు

బళ్లారి సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పాండురంగ ఆలయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తుంగ-గంగా సాంస్కృతిక కళాట్రస్టు ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యప్రదర్శన, ఏకపాత్రాభినయం, కోలాటం, భక్తిగీతాలవన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. కళాకారులను ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేంద్ర, శ్రీనివాసరావు, ధర్మకర్త వెంకోబరావులు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. డాక్టర్ వీణా, డా. ధృవ, అర్చకుడు రాఘవేంద్రరావులను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు నాగభూషణ్, ఉపాధ్యక్షుడు శివరుద్రయ్య, వైష్ణవి, అనన్య, అతిథి, రాధకృష్ణ, రాఘవి, వేదశ్రీ పాల్గొన్నారు.

బస్సు చార్జీల పెంపుపై సీపీఎం నిరసన



గడిగి చెన్నప్ప సర్కిల్లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బళ్లారి సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బస్సు చార్జీలు పెంచి పేదలపై భారం వేసిందని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని గడిగ చెన్నప్ప సర్కిల్లో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పార్టీ నాయకుడు సత్యబాబు మాట్లాడుతూ 15శాతం పెంచిన బస్సు చార్జీల నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసు కోవాలన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు విలవిలలాడుతున్నారని, మళ్లీ భారం మోపడం తగదన్నారు. రవాణా సంస్థల నష్టాలను తగ్గించేందుకు పాలకవర్గం ప్రజా రాజకీయ పార్టీల నుంచి సూచనలు తీసుకోవచ్చన్నారు. సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే గాలి ప్రత్యేకపూజలు



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గాలి కుటుంబ సభ్యులు

బళ్లారి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి శనివారం కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన సతీ సమేతంగా బళ్లారి ఆరాధ్యదైవం కనకదుర్గమ్మ దేవస్థానం ఆవరణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన స్వయంగా అన్నదానం నిర్వహించారు. కుమార్తె బ్రాహ్మణి, ప్రముఖులు కేఎస్ దివాకర్, బంగారు హనుమంతు, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానసిక అస్వస్థతే నేరాలకు మూలం

●మానసిక వైద్యుడు డాక్టర్ మనోహర్ వై పత్తార్



రాయచూరు జనవరి 11(ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో జరుగుతున్న అనేక నేరాలకు మానసిక అస్వస్థత, వైపరీత్యాలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ మనోహర్ వై పత్తార్ అన్నారు. శనివారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రాంగణంలో శనివారం ఏబీడీవైఓ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఘనత, మానవీయ విలువల పరిరక్షణ అనే అంశం పై ఆయన ప్రధాన ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ మనోహర్ వై పత్తార్, మానసిక ఆరోగ్యం బాల్యం నుంచే అలవడుతుందన్నారు. గృహాల్లో బాలికలు, బాలుర పట్ల తల్లిదండ్రులు చూపిన చూపే వైవిధ్యం కూడా ఒక మానసిక వైకల్యంగానే మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాలికలకు సమాజం పట్ల బాధ్యతలను నిర్బంధాలను విధించడం అదే సమయంలో బాలురను స్వేచ్ఛగా వదిలివేయడం అనేక అనర్థాలకు కారణంగా మారుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో బాల్యం నుంచే పిల్లలను లింగభేదం లేకుండా వారిలో మానసిక స్థిరత్వాన్ని పెంచడంతో పాటు ఆలోచన విధానాలను సక్రమమైన మార్గంలో పెంపొందించేందుకు తల్లిదండ్రులు సహితం తమవంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం పాఠశాలల్లో ఉపాధ్యాయులు, కళాశాలల్లో అధ్యాపకులు బాల-బాలికల్లోని మానసిక వికారాలను గుర్తించి తొలగించేందుకు తమవంతు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమానికి రాయచూరు-యాదగిరి జిల్లాలకు చెందిన యువతి-యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

హోసూరు జోన్

ధర తగ్గిన కొత్తిమీర.. నిరాశలో రైతులు

హోసూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో పొదీనా, కొత్తిమీరతోపాటు, వంకాయలు, ముల్లంగి, బీన్సు, పాలకూర ఇలా అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తారు. సుమారు 5వేల ఎకరాలలో పండించిన కొత్తమీరకు ధర పడిపోవడంతో రైతులలో దిగులు నెలకొంది. సంక్రాంతికి మంచి ధర వస్తుందని ఆశించినా ఈమేరకు లభించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కొత్తిమీర కట్ట రూ.10 పలుకుతోంది. గత ఏడాది సంక్రాంతి సీజన్‌లో కొత్తిమీర కట్ట రూ.50 ఉండేది. దిగుబడి బాగున్నా కనీస ధర లభించకపోవడంతో నిరాశ చెందుతున్నారు.



ఏపుగా పెరిగిన కొత్తిమీర

నగరంలో పెరిగిన ట్రాఫిక్

హోసూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా వరుస సెలవులు రావడంతో సొంత ప్రాంతాలకు వెళ్లేవారు సిద్ధమయ్యారు. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ నెలకొంది. మూడు నాలుగు కిలోమీటర్ల వాహనాలు బారులుతీరాయి. ఈ జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణం కూడా ఈ రద్దీకి మరో కారణం. సరిహద్దు కర్ణాటకలోని అత్తిబెలె, తమిళనాడులోని జూజూవాడీ చెక్‌పోస్టు ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొంది. క్రమబద్ధీకరించేందుకు హోసూరు సిప్‌కాట్ పోలీసులు శ్రమించారు.



బారులు తీరిన వాహనాలు

త్రోబాల్ పోటీల్లో విజేత హోసూరు జట్టు



విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హోసూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా నంజునపురంలో కొంగు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాష్ట్ర స్థాయి త్రోబాల్, పుట్‌బాల్, కబడ్డీ పోటీలు సాగాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. త్రో బాల్ పోటీల్లో హోసూరు రీజియన్‌లో శిక్షణ పొందిన హోసూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 25-19, 25-16 తేడాతో వరుస విజయం సాధించారు. హోసూరు ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులను, రాష్ట్రస్థాయిల్లో తృతీయ స్థానం సాధించిన కోచ్ మాణిక్యవాసగం ను అభినందించారు.

రైల్వే వంతెన నిర్మాణానికి డిమాండ్

హోసూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్‌పై బ్రిడ్జ్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు. హోసూరు పసుమైనగర్, వెంకటేశ్వర నగర్, జనకపుర లేఅవుట్, నందనవనం, తిరుకలై నగర్, చుట్టుపక్కల ప్రాంతాలవారికి వీలుగా రాకపోకలకు వీలుగా అండర్‌పాస్ లేదా ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. హోసూరు ఎంపీ గోపినాథ్, రైల్వే అధికారులతో చర్చలు జరిపారు. రైల్వే లైన్‌పై వంతెన నిర్మాణనికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. సమావేశంలో హోసూరుల్లోని ఆల్ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ కార్యదర్శి నీలకంఠన్, స్థానిక నివాసితుల సంఘం నిర్వాహకులు పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ గోపినాథ్